31వ వసంతంలోకి
# చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా
శుక్రవారం 10 ఏప్రిల్ 2026 | పేజీలు : 8

## సీఎం రేవంత్ రెడ్డిపై జీవన్ రెడ్డి విమర్శలు సరికావు

- ఏఐసిసి నిర్ణయం మేరకు ఎమ్మెల్యేలను పార్టీలోకి చేర్చుకున్నాం.
- జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఏమి తక్కువ చేయలేదు
- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 9** : సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి జీవన్ రెడ్డి విమర్శలు సరికావని, ఏఐసిసి నిర్ణయం మేరకు ఎమ్మెల్యేలను పార్టీలోకి చేర్చుకున్నామని, జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఏమి తక్కువ చేయలేదని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల పట్టణంలోని మోతె రోడ్డు గల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్నాళ్లు కాంగ్రెస్ పార్టీలో ఉన్నా మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ, -2లో

## జీవన్‌రెడ్డి చేరిక

# పార్టీకి అతిపెద్ద బలం





- కేసీఆర్ సూచనతో బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్నాం
- జీవన్రెడ్డికి బిఆర్ఎస్ లో సముచితస్థానం కల్పిస్తాం
- సీఎం రేవంత్ రెడ్డి రైతులను మభ్యపెడుతున్నారు
- స్వంత పార్టీ కార్యకర్తల్లోనే ప్రభుత్వంపై ఆక్రోశం ఉంది
- కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సార్లు రైతుబంధు ఎగ్గొట్టింది

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఏప్రిల్ 9:** మాజీ మంత్రి జీవన్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీలో చేరడం పార్టీకి అతి పెద్ద బలమని, మాజీ సీఎం కేసిఆర్ సూచనతో జీవన్రెడ్డిని బిఆర్ఎస్ లోకి ఆహ్వానిస్తున్నామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా పర్యటనలో భాగంగా మాజీ మంత్రి జీవన్రెడ్డి ఆయన నివాసంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బిఆర్ఎస్ నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్రెడ్డిని కేటిఆర్ శాలువాతో సన్మానించారు. అనంతరం కేటిఆర్ విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి జీవన్రెడ్డి కాంగ్రెస్ను వీడి బిఆర్ఎస్లోకి రావడం పార్టీకి అతి పెద్ద బలమని, జీవన్రెడ్డి లాంటి నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రజా సమస్యలపై అవగాహన కల్గిన సీనియర్ నాయకుడని, మాజీ సీఎం కేసిఆర్ 2014లోనే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం ఆయనను టిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారని గుర్తు చేశారు. నిబద్ధత కలిగిన నాయకుడిగా, నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధంతో కాంగ్రెస్ -2లో

## ముద్దసాని ఆశయాలను కొనసాగిస్తాం

- రైతులు, పేద ప్రజల కోసం నిరంతరం పరితపించిన నాయకుడు
- వచ్చే 15వ వర్ధంతి నాటికి జమ్మికుంటలో విగ్రహం
- దామోదర్ రెడ్డి విగ్రహావిష్కరణ సభలో ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ ఏప్రిల్ 09 :** రైతుల కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం దివంగత ముద్దసాని దామోదర్ రెడ్డి నిరంతరం కృషి చేశారని, ఆయన ఆశయాలను సదా కొనసాగిస్తామని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. వచ్చే ఏడాది జరగనున్న 15వ వర్ధంతి కార్యక్రమం రోజున జమ్మికుంటలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి పదివేల మందితో సభ నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.మాజీ మంత్రి, దివంగత ముద్దసాని దామోదర్ రెడ్డి 14వ పురస్కరించుకొని మానకొండూరు మండలం సదాశివ పల్లి జంక్షన్ లో నెలకొల్పిన ఆయన వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఆయన కాంస్య విగ్రహాన్ని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తో కలిసి ఆవిష్కరించారు. సర్దార్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.అనంతరం అలుగునూరులోని శ్రీ లక్ష్మీ నరసింహా కన్వెన్షన్ లో నిర్వహించిన ముద్దసాని దామోదర్ రెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు.టీపీసీసీ -2లో

## కేటీఆర్ పర్యటనలో అపశృతి

- జీవన్ రెడ్డి నివాసంలో తోపులాట
- జర్నలిస్టులకు తీవ్ర గాయాలు



**జగిత్యాల, ఏప్రిల్, 09 :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో పర్యటించారు. అయితే జీవన్ రెడ్డి ఇంటికి కేటీఆర్ చేరుకునే సమయంలో తోపులాటలో అపశృతి చోటుచేసుకుంది.వార్తల కవరేజ్ కోసం ఉన్న సమయంలో నాయకులు జర్నలిస్టులను నెట్టివేయడం తో ౹౹ న్యూస్ రిపోర్టర్ సాయి తీవ్రంగా గాయపడి కాలుకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే ఆయనను స్థానిక ఆస్పత్రికి తరలించారు.ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తో కలిసి జగిత్యాలలోని ఆస్పత్రికి వెళ్లి బాధితుడు సాయిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గాయపడిన సాయికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఆలాగే ఈ ఘటన పై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి తమ సానుభూతిని తెలియజేసారు..సాయి కుమార్ వైద్య ఖర్చులు తామే భరిస్తామన్నారు.ఈ ఘటన జరగడం దురదృష్టకరమన్నారు.

## రైతుల సంక్షేమానికి పాటుపడుతా

**-కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్**



**చురకలు విలేకరి,మల్లాపూర్,ఏప్రిల్ 9 :** రైతుల సంక్షేమానికి ఎల్లవేళలా పాటుపడుతానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.రైతులు దళారుల బారిన పడకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుకు సహకరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అల్లూరి లక్ష్మణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు జరిగేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బందులు కల్గకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి సీపీఐ సామూహిక నిధి సేకరణ



**చురకలు విలేకరి,మల్లాపూర్,ఏప్రిల్ 9 :** మల్లాపూర్ మండలంలో జగిత్యాల జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇంటింటికి సీపీఐ సామూహిక నిధి సేకరణ కార్యక్రమాన్ని గురువారం సీపీఐ నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సమ సమాజ స్థాపన కోసం, వర్గ దోపిడికి వ్యతిరేకంగా ప్రజల కోసం ప్రజల మధ్య ఉండి ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్నామని, సీపిఐని పటిష్టం చేసుకోవడానికి ప్రజా సమస్యలపై పోరాట కార్యక్రమాల నిర్వహణ వ్యయంతో కూడుకున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికి సీపీఐ పేరుతో సామూహిక నిధి సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. సీపీఐ పార్టీని ప్రజలు అక్కున చేర్చుకొని ఆర్థిక సహాయం చేస్తున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ మండల సీపీఐ నాయకులు గుడెల్లి రాజన్న, జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, జిల్లా నాయకురాలు ఎన్నం రాధ, చౌల దేవిక, అందె వంశీకృష్ణ, బండి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిపై జీవన్ రెడ్డి విమర్శలు సరికావు

**మొదటి పేజీ తరువాయి....** సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్వయంగా జీవన్ రెడ్డిని కలిసి బుజ్జగించినా, ఆయన తొందరపడి కాంగ్రెస్ పార్టీ వీడారన్నారు. 2014 నుండి 2023 వరకు మాజీ సీఎం కేసిఆర్, బిఆర్ఎస్ పార్టీని అందరి కంటే ఎక్కువ విమర్శించిన జీవన్ రెడ్డి ఇప్పుడు అదే పార్టీ తీర్థం పుచ్చుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రెండేళ్లలోనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందని, ప్రజలు మార్పును కోరుకుంటున్నారని వ్యాఖ్యానించడం సబబుకాదన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, డిసిసి అధ్యక్షుడు గాజెంగి నందయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్, మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, సీనియర్ నాయకులు బండ శంకర్, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం

**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఎప్రిల్ (09) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జాతర ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం లో అర్చకులు చక్రపాణి మాధవ చార్యులు ఆధ్వర్యంలో శ్రీనివాసుని శ్రీదేవి, భూదేవి ల కళ్యానోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని భక్తులు కనులరా తిలకించి పులకించిపోయారు.

# జీవన్‌రెడ్డి చేరిక....

**మొదటి పేజీ తరువాయి...** పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. 2014లో ఎమ్మెల్యేగా జీవన్రెడ్డి విజయం సాధించారని, మాజీ సీఎం కేసిఆర్ జీవన్రెడ్డికి నాలుగు దశాబ్దాలుగా స్నేహం, పరస్పర గౌరవం ఉందని గుర్తు చేశారు. 2014లో సీఎం కేసిఆర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి స్వయంగా కేసిఆర్ తో మాట్లాడుతూ జగిత్యాల ప్రజల తరుపున బోర్నపల్లి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరగా, కేసిఆర్ వెంటనే స్పందించి అదే వేదిక నుండి రూ.75కోట్ల నిధులను కేటాయించారని గుర్తు చేశారు. రైతుల పక్షాన అసెంబ్లీలో గట్టిగా కొట్లాడిన నాయకుడు జీవన్ రెడ్డి అని, నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరించాలని పలుమార్లు అసెంబ్లీలో కొట్లాడారని గుర్తు చేశారు. జీవన్రెడ్డిని బిఆర్ఎస్లోకి ఆహ్వానించడానికి జిల్లా నేతలు తనను కోరారని, రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడానికి, పార్టీ బలోపేతానికి జీవన్రెడ్డి చేరికతో లాభం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో, రైతుల్లో ఆక్రోశం వ్యక్తమవుతుందని, సీఎం రేవంత్ రెడ్డి తన పరిపాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి డైవర్షన్ పాలిట్రిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి భాష దారుణంగా ఉందని, సీఎం రైతులను మభ్యపెడుతూ కాలం వెల్లదీస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మూడు సార్లు రైతుబంధు ఎగ్గొట్టిందని విమర్శించారు. రెండున్నరేళ్లలో రైతుబంధు రూ.27 వేల కోట్లను ఎగ్గొట్టిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిదని, సీఎం స్థాయికి తగని మాటలు మాట్లాడుతూ సీఎం స్థాయిని తగ్గిస్తున్నారని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి గ్యారెంటీకార్డు ఇచ్చింది లి మీరు కాదా అని ప్రశ్నించారు. జీవన్రెడ్డి లాంటి నిఖార్సైన కాంగ్రెస్ నాయకుడిని అవమానించి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారన్నారు. స్వంత ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైతం ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారని, రాష్ట్రంలో ప్రజల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. సీఎం రేవంత్రెడ్డి అధికార మత్తులో అహంకారంతో మాట్లాడుతున్నారని, కాలం ఎన్నాటికి ఒకేలా ఉండదని, అధికారం ఎవరి సొత్తు కాదన్నారు. తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని, రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, మాజీ సీఎం కేసిఆర్ సూచన మేరకు జీవన్ రెడ్డిని బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించామని, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. రాష్ట్రంలోని రైతులు, పేద ప్రజల మోహాల్లో చిరునవ్వు రావాలంటే కేసిఆర్ మళ్లీ సీఎం కావాలన్నారు. బిఆర్ఎస్ పార్టీలో జీవన్ రెడ్డికి సముచితస్థానం కల్పిస్తామని కేటిఆర్ వెల్లడించారు.

**కేటిఆర్ పర్యటనలో తోపులాట...**

**పలువురు పాత్రికేయులకు గాయాలు...**

జగిత్యాల జిల్లా పర్యటనలో భాగంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి నివాసానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ వచ్చిన సందర్భంగా తోపులాట చోటుచేసుకుంది. కేటిఆర్ రాక కోసం జీవన్ రెడ్డి నివాసంలో ఎదురు చూస్తున్న పాత్రికేయులపై ఆకస్మాత్తుగా కేటిఆర్తో వచ్చిన జనం లోపలికి చొచ్చుకరావడంతో అక్కడ వేచి ఉన్న పాత్రికేయులు తోపులాటలో కింద పడి గాయాలపాలయ్యారు. ఈ తోపులాటలో ఓ పాత్రికేయుడికి కాలు ఫ్యాక్చర్ కాగా, సహచర పాత్రికేయులు వెంటనే అతనిని అంబులెన్స్ ఆస్పత్రికి తరలించారు.

# ముద్దసాని ఆశయాలను కొనసాగిస్తాం

**మొదటి పేజీ తరువాయి...** ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ పేద ప్రజలు, కార్యకర్తల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న దామోదర్ రెడ్డి విగ్రహాన్ని ఎప్పుడో ఏర్పాటు చేయాల్సి ఉండేదని, అనివార్య కారణాలవల్ల కార్యరూపం దాల్చలేదన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు నాయకత్వం వహించిన దామోదర్ రెడ్డి ఎంతోమంది నాయకులను తీర్చిదిద్దారని అన్నారు. తనతో పాటు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే రామ్ రెడ్డి లను ఎమ్మెల్యేలను చేసిన ఘనత దామోదర్ రెడ్డి కే దక్కుతుందన్నారు. దామోదర్ రెడ్డి వల్లనే తాను ఈ స్థాయికి వచ్చానని విజయ రమణారావు సగర్వంగా చెప్పారు. ప్రజలతో, పార్టీ నాయకులు కార్యకర్తలతో ఎలా ఉండాలో, వారికి దగ్గరగా ఉండి ఎలా పనులు చేయాలో దామోదర్ రెడ్డిని చూసి నేర్చుకున్నానని తెలిపారు. మా సోదరుడు చనిపోతే తమకు దగ్గరుండి పని చేశారని గుర్తు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా ప్రతిపక్ష హోదాలో ఉన్నటువంటి ఏకైక ఎమ్మెల్యే ముద్దసాని దామోదర్ రెడ్డి అని, 1994లో జరిగిన ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుని రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు. నిరంతరం ఆయన బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం, రైతుల కోసం కృషి చేశారని అన్నారు. కమలాపూర్ నియోజకవర్గంలో ఒక్క మడి కూడా ఎండకుండా కాలువ ద్వారా నిరంతరం నీళ్లు పారించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆనాడు గ్రామాల్లో నక్సలైట్ల ఉద్యమం కొనసాగుతున్న సందర్భంలో చాలామంది యువకులు గ్రామాల్లో ఉండలేని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. పార్టీ కార్యకర్తలు ఎన్కౌంటర్ల పాలు కాకుండా, పోలీసు దెబ్బలు తినకుండా కంటికి రెప్పలా కాపాడుకున్నారని గుర్తు చేశారు. తనను నమ్ముకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు, ప్రజలకు న్యాయం చేశారని అన్నారు. ఆయన ఒక్క పిలుపు ఇస్తే పదివేల మంది కార్యకర్తలు ఒక చోటికి చేరేవారన్నారు. కమలాపూర్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీకి కంచుకోటలా తయారు చేశారని,ఇప్పటికీ ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలవలేదని అన్నారు. రెండు దశాబ్దాల పాటు వరుస విజయాలతో దూసుకుపోయిన దామోదర్ రెడ్డి,2004 ఎన్నికల్లో అనారోగ్య కారణాల వల్లనే ఆయన ఓటమి చెందారని తెలిపారు. దామోదర్ రెడ్డి భౌతికంగా లేకపోయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన గురించి తలవని ఊరు, మనిషి లేదని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలని విజయ రమణారావు పిలుపునిచ్చారు.

**పేద ప్రజల పక్షపాతి దామోదర్ రెడ్డి మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**

రెండు దశాబ్దాల పాటు సుదీర్ఘకాలంగా ఎమ్మెల్యేగా మంత్రిగా పని చేసిన ముద్దసాని దామోదర్ రెడ్డి పేద ప్రజల పక్షపాతి అని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వం పల్లి సత్యనారాయణ అన్నారు. ముద్దసానిది మా పక్క ఊరే కావడంతో ఆయన వద్దకు ఏ పనికి వెళ్లినా కూడా కాదనకుండా చేశారని గుర్తు చేశారు. ఆయన ఫోను తీశాడు అంటే ఆ పని కచ్చితంగా కావాల్సిందేనని అన్నారు. ఆయనను నమ్ముకున్న పార్టీ కార్యకర్తలు, ప్రజలకు ఎంతో సేవ చేశాడని గుర్తు చేశారు. దేవాలయాల్లోకి దళితులను రానివ్వ లేని రోజుల్లో ఇల్లందకుంట దేవస్థానానికి దళితుడిని చైర్మన్ చేసిన ఘనత దామోదర్ రెడ్డి కే దక్కుతుందని అన్నారు. తన కుటుంబ సభ్యులు వ్యతిరేకించినా కూడా ఒక దళితురాలిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారని అన్నారు. దామోదర్ రెడ్డి విగ్రహాన్ని దామోదర్ రెడ్డి నాయకత్వం ఎంతోమందికి రోల్ మోడల్ గా నిలిచిందని, ఆయన నాయకత్వంలో పలువురు ఎమ్మెల్యేలుగా, ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయ్యారని అన్నారు. దామన్న అడుగుజాడల్లో నడుస్తున్న ప్రభుత్వ విప్ విజయ రమణారావు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన ఆశయ సాధన కోసం పాటుపడతామని సత్యనారాయణ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లాను శాసించిన ఏకైక నాయకుడు దామోదర్ రెడ్డి అని, ఆ నాయకుని వర్ధంతిని మనం జరుపుకోవడం సంతోషకరమన్నారు. ముద్దసానికి కృతజ్ఞతగా సదాశివపల్లిలో విగ్రహాన్ని నెలకొల్పామని కవ్వం పల్లి వివరించారు.

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దామోదర్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కూడలిని మంచి ఐలాండ్ గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాటి టీడీపీ నాయకులు దామోదర్ రెడ్డితో గడిపిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కొందరు ఉద్వేగానికి లోనయ్యారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ ముద్దసాని దామోదర్ రెడ్డి ఎమ్మెల్యేగా మంత్రిగా ప్రజలకు చేసిన సేవలు, ఆయన అనుసరించిన విధానాలు రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని యువకులు రాజకీయాల్లోకి రావాలన్నారు.కరీంనగర్ మేయర్ కె శ్రీనివాస్,పెద్దపల్లి గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, రామగుండం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పాతుపల్లి ఎల్లయ్య, హుజురాబాద్ నియోజకవర్గం ఇన్చార్జి వోడితెల ప్రణవ్ బాబు, దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ముద్దసాని పురుషోత్తం రెడ్డి, మధుసూదన్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు కొత్తూరి జగన్ గౌడ్, వాసాల రమేష్, డాక్టర్ పి. రవీందర్ రావు, కర్రు నాగయ్య, మాదాడి శ్రీనివాస్ రెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, తగ్గు దామోదర్,ఆకుల నరసయ్య, మినుపాల ప్రకాష్ రావు, అక్కపాక తిరుపతి, కొత్త తిరుపతిరెడ్డి, కందుల ఆది రెడ్డి, చందా గాంధీ పాల్గొన్నారు.

# ఆర్టిజన్,అన్మన్‌ల పోరుబాట....!

**-అరకోరక వేతనం అందని అర్టిజన్,అన్మన్‌డుల సహకారం**
**- సమస్యల పరిష్కారానికి సర్కారుపై సమర శంఖం**
**- డివిజన్ కార్యలయం ముందు నిరవదిక సమ్మె**





**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ (09) :** తెలంగాణ రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్,అన్మాన్ దు కార్మికులు పోరుబాట పట్టారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్ప వేరే మార్గం లేదంటూ తొమ్మిది సంఘాలు ఏకతాటిపైకి వచ్చి జేఏసీ ఏర్పడి ఉమ్మడి పోరుకు సిద్ధమయ్యారు. తమ సమస్యల పరిష్కారానికి ఆర్టిజన్లు సమ్మెకు రెడీ అయ్యారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా గత కొన్నిరోజులుగా అన్ని జిల్లాల్లో సంతకాల సేకరణ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 19061 మంది ఆర్టిజన్లు ఉండగా,అందులో టీజీ ట్రాన్స్‌కోలో 3769,జెన్‌కోలో 3583, ఎస్పీడీసీఎల్‌లో 8244,ఎన్పీడీసీఎల్‌లో 3465 మంది ఉన్నారు.ఆర్టిజన్లు విద్యుత్‌లైన్లు,ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, ఫ్యూజ్‌ఆఫ్‌కాల్ అటెండ్ చేయడం,కొత్త విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటు,మీటర్ల ఇన్‌స్టాలేషన్,రీడింగ్ నమోదు చేయడం, బ్రేక్‌డౌన్ సమయంలో పునరుద్ధరణ తదితర పనులు చేస్తున్నారు.ప్రస్తుతం వీరికి ప్రారంభవేతనం 15 వేల నుంచి గరిష్ఠంగా 25వేల వరకు ఉంది. తమను రెగ్యులర్ కార్మికులుగా మార్చాలంటూ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.అధికారులు మాత్రం ఇందుకు అర్హతలు ఉండాలని చెప్పడంతో సీనియార్టి ప్రకారం కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లి డివిజన్ విధ్యుత్‌శాఖ పరిదిలోని పనిచేస్తున్న ఆర్టిజన్లు గురువారం నిరవదిక సమ్మె లో పాల్గొన్నారు.ఆర్టిజన్‌ల కన్వర్షన్‌కు నోచుకోకపోవడంతో సర్వీస్ రూల్స్ రూపొందించలేదని,దీంతో వారికి ఏవీ వర్తించడం లేదని,విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందితో సమానంగా ఆర్టిజన్లు ప్రయోజనాలు పొందడం లేదని,ఆర్టిజన్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అం దడం లేదు.సెలవులు అమలు కావడం లేదు.పే స్కేల్ చాలా తక్కువగా ఉంది. కానీ రెగ్యులర్ ఉద్యోగులతో కలిసి పనిచేస్తున్నా గ్రాట్యుటీ,అరకొరవేతనమే అందుతున్నది.పేరుకు కోటిరూపాయల ఇన్సూరెన్స్ అమలు చేస్తున్నా వందల మంది కార్మికులు చనిపోతే ఒకరికి మాత్రమే కోటి రూపాయల ఇన్సూరెన్స్ ఇస్తున్నారు.ప్రమాదాలు,బారినపడి కార్మికులు చనిపోతే పరిహారం నామ మాత్రంగా ఇచ్చి చేతులు దులుపు కొంటున్నారని అవేదన చెందుతున్నారు. న్యాయపరమైన డిమాండ్స్ ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుండి గాని యాజమాన్యం నుండి గాని ఎలాంటి స్పందన రాక పోవటంతో సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె ప్రారంభించారు. ముందుగా మా డిమాండ్స్ ఆర్టిజన్ కార్మికులకు ఏపీ ఎస్ఈబిరూల్స్ వర్తింపజేయాలని వారి అర్హతను బట్టి కన్వర్షన్ చేయాలి అన్యానుడు కార్మికులను స్పాట్ బిల్డర్స్‌ని సంస్థలో విలీనం చేయాలి బిల్ కలెక్టర్లను జీవో నెంబర్ 11ప్రకారం కనీసవేతనం అమలుచేసి 30రోజులపని కల్పించాలని 2026 పిఆర్సి వెంటనే అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కోచైర్మన్ కాశెట్టి రాంబాబు,కన్వీనర్ దమ్మ రవీందర్ రెడ్డి, డివిజన్ కో చైర్మన్ పిట్టల మహేష్, విష్ణువర్ధన్,శ్రీకాంత్,క్రాంతి,లోకేష్ , రాజేందర్,నాగార్జున,శ్రీధర్,సాగర్, శ్యామ్,ధరణి,శరణ్య తదితరులు పాల్గొన్నారు.

**విద్యుత్ శాఖ మంత్రి స్పందించాలి**
**అర్టిజన్ల జగిత్యాల జిల్లా కన్వినర్ దమ్మ రవిందర్ రెడ్డి**



విద్యుత్ శాఖలో ఆర్టిజన్లుగా పనిచేస్తున్న వారిసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. విద్యుత్ శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క సారధ్యంలో తమ డిమాండ్ పరిష్కారం కోసం కృషి చేసి ఉద్యోగ భద్రత వేతన సవరణ జీవో ప్రకారం చేపట్టాలి.

**పనికి తగ్గ వేతనం ఉద్యోగ భద్రత కల్పించాలి**
**డివిజన్ కో చైర్మన్ పిట్టల మహేష్**



ఆర్టిజన్లు గత కొన్ని సంవత్సరాలు గా విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తూ ఇచ్చిన వేతనాన్ని తీసుకుంటూ ఉద్యోగ భద్రత లేకుండా విధులు నిర్వహిస్తున్నా రు. ప్రభుత్వం పనికి తగ్గ వేతనం ఉద్యోగ భద్రత కల్పించి ఆర్టిజన్ సమస్యను పరిష్కరించాలి.

**విధి నిర్వహణలో ప్రమాద బారిన పడితే కుటుంబానికి రక్షణ లేదు**
**సాంబారి రక్షిత (విధి నిర్వహణలో గాయపడ్డ హరిష్ భార్య)**



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని బర్థిపూర్ గ్రామంలో అన్మాన్ దు గా విధులు నిర్వహిస్తూ సంవత్సరం క్రితం సాంబార్ హరీష్ స్తంభం పై నుండి పడి మంచానికి పరిమితం కాక పోగ కుటుంబానికి రక్షణ లేకపోగా, ఉద్యోగ బద్రత లేదు ప్రభుత్వం స్పందించి శాశ్వత పరిష్కారం చూపి ఉద్యోగ భద్రత కల్పించాలి.

**విధి నిర్వహణలో ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి**
**గాందారి శ్రీకాంత్ అన్మాన్‌డ్ (వేములకుర్తి)**




విధి నిర్వహణలో అధికారుల ఆదేశాల ప్రకారం పనులు చేపడుతున్న సమయంలో స్థంభం ఏ క్రమంలో విద్యుత్ మరమ్మత్తులు చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నం. గత కొన్ని సంవత్సరాలుగా చాలీచాలని వేతనంతో ఆర్టిజన్ పనిచేస్తున్నాను. విద్యుత్ షాక్ తగిలి పెద్ద ప్రమాదం జరిగింది. శాఖ పరంగా కొంత సహకరించిన అన్మాన్డు కావడంతో ఆశించినంతగా విద్యుత్ సంస్థ నుండి రావాల్సిన అంత పరిహారం రాలేదు. ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి.

# జనగణన ప్రక్రియ సమావేశం



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఏప్రిల్ (09) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల కేంద్రం లోని తహశీల్దార్ కార్యాలయంలో గురువారం జగిత్యాల జిల్లా ప్రిన్సిపాల్ సెన్సస్ ఆఫీసర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు,జనగణన-2027 ప్రక్రియలో భాగంగా ఎఫ్ బి (ఎన్యుమరేషన్ బ్లాక్) లను మ్యాప్ పై గుర్తించుటకు సంబంధిత పంచాయత్ సెక్రటరీ లతో మీటింగ్ ఏర్పాటు చేసి, ప్రతి గ్రామా పంచాయతీలలో 1,2,3,ఈటిసి బ్లాక్ లను సుమారుగా గుర్తించడం జరిగినది .అలాగే ప్రతి గ్రామ ఇబి (ఎన్యుమరేషన్ బ్లాక్) మ్యాప్ లో మొదలు పెట్టె స్తానాలను కూడా మార్క్ చెయ్యడం జరిగినది.(వాడ పేరు యజమాని పేరు) గుర్తిచలన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బిఎస్ ఎస వర ప్రసాద్, డిప్యూటీ తహసిల్దార్ ప్రసాద్, ఆర్ ఐ లు రమేష్, రేవంత్ రెడ్డి, సంబంధిత జి పిఓలు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకిచ్చిన హామీలన్నీ అటకెక్కించిన కాంగ్రెస్ ప్రభుత్వం

**-బిజెపి నాయకులు మామిడిపల్లి ప్రసాద్**



**చురకలు విలేకరి ఎండపల్లి ఏప్రిల్ 09 :** తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం ఏర్పడినాక హామీలన్నింటిని అటకెక్కిచ్చిందని ఎండపల్లి మండల బిజెపి నాయకులు మామిడిపల్లి ప్రసాద్ ఆరోపించారు. అంబేద్కర్ అభయ హస్తం కింద దళితులకు జీవనోపాధి కోసం 12 లక్షలు అందిస్తామని, మహాలక్ష్మి పథకంలో మహిళలందరికీ నెలకు 2500 అందిస్తామని, అలాగే సామాజిక భద్రత పింఛన్లు వృద్ధులకు,వితంతువులకు రూ.4000, వికలాంగులకు రూ.6000 పంపిణీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి తాత్సారం చేస్తూ పేద ప్రజలకు మొండి "చేయి" చూపే ఆలోచనల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా ప్రజా పాలనలో మాది రైతు ప్రభుత్వమని వేదికలపై ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే మంత్రులు వ్యవసాయ భూమిలేని కూలీలకు రూ.12000 ఏడాదికి అందజేస్తామని చెప్పి ఇంతవరకు ఏ ఒక్క కుటుంబానికి అందజేశారో రాష్ట్ర మంత్రులు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని మామిడిపల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు.

## చెట్ల కొమ్మలు తొలగించిన విద్యుత్ శాఖ సిబ్బంది



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఏప్రిల్ (09) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని గోదుర్ 132/33 కెవి పెద్ద సబ్ స్టేషన్ నుండి యామపూర్, వేములకుర్తి సబ్ స్టేషన్లకు వచ్చే 33కెవి గోదుర్ ఫీడర్ లో చెట్ల కొమ్మలను గురువారం విధ్యుత్ శాఖ సిబ్బంది కోట్టివేశారు.ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండా,యామాపూర్,ఫకీర్ కొండాపూర్, వేములకుర్తి,బర్దిపూర్, మూలరాంపూర్ గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేసి వైర్ల కింద ఉన్న చెట్లను వాటి కొమ్మలను తోలగించారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ సతీష్, సీనియర్ లైన్ ఇన్సుస్పెక్టర్ నర్సయ్య, లైన్ ఇన్సుస్పెక్టర్ నల్లల ప్రాంక్లన్,లైన్మెన్ కొలిపాక రాజు, ఎఎల్ ఎం ఎస్కిల మహేష్,చింతకింది రవి,సిబ్బంది నునే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఎన్ఆర్ఐ విక్రమ్ మృతి



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఏప్రిల్ (09) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని వేములకుర్తి గ్రామంలో ఎన్ ఆర్ ఐ గోళ్ళపెళ్ళి విక్రమ్ గురువారం మధ్యాహ్నం మృతిచెందారు. విక్రమ్ 30 సవత్సరాలు గా యుఎఈ దేశంలో కంపెనీలు పెట్టి ఎందరికో ఉద్యోగ అవకాశాలు కల్పించారు. అరు నెలల క్రితం స్వగ్రామం వచ్చిన విక్రమ్ పక్షవాతం తో బాదపడుతుండగా చికిత్స నిమిత్తం హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో చుపిచుకున్న ఫలితం లేదు దింతో విక్రమ్ మృతిచెందారు. శుక్రవారం స్వగ్రామం అత్యక్రియలు జరగన్నాయి. విక్రమ్ కు బార్య,కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. విక్రమ్ మృతి పట్ల గ్రామస్తులు, ఎన్ ఆర్ ఐ లు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు తొలగిన అడ్డంకులు

**చురకలు విలేకరి ఎండపల్లి ఏప్రిల్ 09 :** ఎండపల్లిమండలంలోని కొత్తపేట గ్రామంలో బుధవారం అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆ గ్రామసర్పంచ్ జి రెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేసిన భూమి పూజ అనంతరం స్థానికులు, కొన్ని అగ్రవర్ణాల కుట్రలతో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆటంకం సృష్టించ గా విషయం తెలుసుకున్న మండల దళిత సంఘాలు,అంబేద్కర్ జయంతో త్సవ కమిటీ అధ్యక్షుడు చెన్న కుమార స్వామి ఆధ్వర్యంలో భారీ ఎత్తున కొత్తపేట గ్రామానికి చేరుకొని నిరసన వ్యక్తం చేయడంతో స్థానిక తాహసిల్దార్ ఎడ్ల అనిల్ కుమార్,ఎస్సై పి.ఉదయ్



కుమార్, ఎంపీడీవో దొండ కృపాకర్ లు అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు స్థలానికి చేరుకొని ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి విగ్రహ ఏర్పాటుకు ఎవరు ఆటంకం సృష్టించిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు దీంతో దళిత సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అడ్డంకులు తొలగించిన స్థానిక అధికారులు ఎస్సై ఉదయ్ కుమార్ సర్పంచ్ జీ రెడ్డి మహేందర్ రెడ్డికి దళిత సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మంతెన లక్ష్మణ్, వీ<sup></sup>జిల్లా ప్రధానకార్యదర్శి మోకేనాపల్లి సతీష్ మాజీ వీుుజ కోడి గంగయ్య దళిత నాయకులు దూడ భూమయ్య, దేవి రవీందర్, బోయిని మధు గౌరీ చిరంజీవి అరెల్లి మహేష్,సదన్,ఎనగందుల సంతోష్, న్యాతారి మల్లేష్, కొత్తూరి లింగయ్య, కుశనపెల్లి రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

### వినియోగదారులకు నిరంతరం

# నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

**-ప్రజాబాటలో విద్యుత్ అధికారులకు ఆదేశాలు**

**జగిత్యాల**

**-సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. సుదర్శనం**

**చురకలు ప్రతినిధి కోరుట్ల ఏప్రిల్ 9 :** వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను జగిత్యాల సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.




సుదర్శనం ఆదేశించారు.గురువారం ఆయన ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలో విద్యుత్ ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా పరిస్థితులను సమీక్షిస్తూ వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యుత్ నియంత్రికలకు అమర్చిన స్మార్ట్ మీటర్లను ఆయన తనిఖీ చేసి వాటి పనితీరును పరిశీలించారు ఈ స్మార్ట్ మీటర్లు నిరంతర విద్యుత్ సరఫరాకు దోహదపడతాయని తెలిపారు కోరుట్ల పట్టణంలో 160 కేవీఏ పైగా సామర్థ్యం గల నియంత్రికలకు ముందుగా స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నట్లు చెప్పారు త్వరలో ఈ పనులను పూర్తిచేసి వినియో గదారులకు మెరుగైన సేవలు అందిసా _మని పేర్కొన్నారు అలాగే విద్యుత్ సిబ్బంది లైన్లపై పని చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవసర మైన రక్షణ పరికరాలు వినియోగించి ప్రమాదాలను నివారించాలని సూచించారు ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి డిఇ మధుసూదన్ జగిత్యాల డిఇ (టెక్నికల్) గంగారాం కోరుట్ల ఏడిఇ భూమేశ్వర్ ఏఇ శ్యామ్ టెక్నికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెల్గటూర్ మండలంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన





చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఏప్రిల్ 9 :

జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లె మోడల్ స్కూల్, వెల్గటూర్ నర్సరీతో పాటు, స్థంభంపల్లిలోఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం ఆఖస్మిక తనిఖీ చేపట్టారు.ఆదర్శపాఠశాలలో కిచెన్ రూం నిర్మాణ పనులను, మధ్యాహ్న భోజనం వంటకాలను కలెక్టర్ పరిశీలించారు.మెనూ ప్రకారం పరిశు భ్రతతో వంటకాలు తయారు చేయాలని సూచించారు. స్తంభంపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని వెంటనే బిల్లులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఎండకాలం దృష్టిలో పెట్టుకొని నర్సరీలో మొక్కలు వాడిపోకుండా నీటి సరఫరా తదితర చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రఘువరన్ , వెల్గటూర్ ఎంపీడీవో నరేష్ కుమార్, ఎండపల్లి ఎంపీడీవో కృపాకర్, వెల్గటూర్ ఎమ్మార్వో శేఖర్,హౌసింగ్ ఏఈ ప్రసాద్ , పిఆర్ ఏఈ రాజ్ కుమార్, ఏపిఓ అనిల్, ప్రిన్సిపల్ కృష్ణప్రసాద్,స్థంభంపల్లి సర్పంచ్



రాజయ్య, ఉపసర్పంచ్ గంగయ్య, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మోతిబిందు ఆపరేషన్ శిబిరం



**చురకలు ప్రతినిధి కోరుట్ల,ఏప్రిల్, 09 :** కోనరావుపేట మండలం ఐలాపూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మోతిబిందు ఆపరేషన్ కోసం వైద్య శిబిరం నిర్వహించబడింది.ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, మోతిబిందు సమస్యతో బాధపడుతున్న రోగులను గుర్తించారు.ఎంపికైన రోగుల కు ఉచిత శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు,వైద్య సిబ్బంది,గ్రామ పెద్దలు పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామ ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని లయన్స్ క్లబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంచార్జి ఏఎంసి చైర్మన్‌గా గోళ్ళ తిరుపతి



**చురకలు, విలేఖరి,వెల్గటూర్,ఏప్రిల్ 9 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇంచార్జి చైర్మన్ గా వైస్ చైర్మన్ గోళ్ళ తిరుపతిని నియమిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడం తో గురువారం పదవి బాధ్యతలు అప్పగించినట్లు వెల్గటూర్ ఏఎంసి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇదివరకు మార్కెట్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించిన గుండాటి గోపిక జితేందర్ రెడ్డి ఇటీవల పదవికి రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్ కు ఇంచార్జి ఏఎంసి చైర్మన్ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు




**చురకలు,విలేఖరి,వెల్గటూర్,ఏప్రిల్ 9 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం మొక్కట్రావుపేట గ్రామంలో 113పశువులకు గురువారం ప్రభుత్వ ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారిని శ్రీప్రియ తెలిపారు.ఈ కార్యక్ర మంలో మొక్కట్రావుపేట గ్రామ సర్పంచ్ కూస లక్ష్మణ్,రైతులు, పశువైద్య సిబ్బందిపాల్గొన్నారు.

## ఖైదీలకు రక్త పరీక్షలు




**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 9 :** హుజురాబాద్ పట్టణం లోని సబ్ జైల్ లో ఖైదీలకు గురువారం రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక లో భాగంగా గురువారం ఖైదీలకు హెచ్ఐవి,హెపటైటిస్ బి, ఆర్‌బిఎస్,ఇతర పరీక్షలు నిర్వహించినట్లు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. ఖైదీలందరికీ కంటి పరీక్షలు కూడా నిర్వహించామని వివరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రావణ్ కుమార్, వైద్యులు ప్రసాద్ రావు,తులసీదాసు,జరీన్,ఐసిటిసి కౌన్సిలర్ సుజాత, ల్యాబ్ సిబ్బంది, జైలు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి కవచంగా ఆది శ్రీనివాస్



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 09 :** తెలంగాణ రాజకీయాల్లో ఇటీవలి కాలంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి బలమైన వాయిస్‌గా, ప్రతిపక్షాల విమర్శలకు సమర్థంగా ఎదురుదాడి చేసే నేతగా ఆయన నిలుస్తున్నారు.అసెంబ్లీ వేదికగానీ, సీఎల్పీ సమావేశాలుగానీ ఎక్కడైనా ప్రతిపక్షాలు చేసే ఆరోపణలను ఆది శ్రీనివాస్ గారు తక్షణమే ఎండగడుతున్నారు. వాస్తవాలను స్పష్టంగా చెప్తుతూ, ప్రతి అంశంపై పూర్తి అవగాహనతో అనర్గళంగా మాట్లాడటం ఆయన ప్రత్యేకతగా మారింది.గాంధీభవన్‌లో మీడియా సమావేశాలు నిర్వహిస్తూ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు చేస్తున్న అసత్య ప్రచారాలను ఆధారాలతో ఖండిస్తున్నారు . గ్రామాలలో పర్యటిస్తున్న సమయంలో కూడా అక్కడికక్కడే వీడియో క్లిప్పింగ్‌లు విడుదల చేసి ప్రతిపక్షాలకు గట్టి కౌంటర్ ఇస్తూ పార్టీకి బలమైన కవచంగా వ్యవహరిస్తున్నారు.ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు.మీడియా వేదికగా ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించడంతో పాటు,ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలకు సాక్ష్యాలతో సమాధానం ఇస్తున్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ఎలాంటి విమర్శలు వచ్చినా, వెంటనే స్పందిస్తూ ఆయనకు బలమైన మద్దతుదారుడిగా నిలుస్తున్నారు.సీఎంకు అత్యంత సన్నిహితుడిగా ఉన్న ఆది శ్రీనివాస్ గారు,పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు .వేములవాడ నియోజకవర్గంలో కూడా ఆది శీనన్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ కోట్లాది రూపాయలు మంజూరు తెస్తున్నారు. ప్రజలతో నిత్యం మమేకమై వారి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు.రాష్ట్ర రాజకీయాల్లో మున్నూరుకాపు సామాజిక వర్గానికి ప్రాధాన్యం కల్పించే దిశగా కూడా ఆది శీనన్న పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.బీసీ వర్గాల్లో బలమైన ప్రతినిధిగా ఉన్న ఆది శ్రీనివాస్ గారికి మంత్రి పదవి ఇవ్వాలనే చర్చలు జోరుగా సాగుతున్నాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్వయంగా హైకమాండ్‌కు ఆది శ్రీనివాస్ గారి పేరును సిఫార్సు చేసినట్టు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పార్టీకి నిస్వార్థంగా సేవలందిస్తూ, ప్రజల మధ్య ఉండే నాయకుడిగా గుర్తింపు పొందిన ఆది శ్రీనివాస్ గారికి త్వరలోనే మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నాయి.

# తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

**-కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుల హెచ్చరిక**




**చురకలు ప్రతినిధి,మంథని, ఏప్రిల్ 9 :** తెలంగాణ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని తగిన సమయంలో సరైన సమాధానం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు హెచ్చరించారు.గురువారం మంథని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దళిత బంధు సాధన సమితి నాయకులు గద్దల శంకర్, ఊట్ల శ్రీను లు చేసిన ఆరోపణలు వారు తీవ్రంగా ఖండించారు. దళిత బందు పేరుతో బీఆర్ఎస్ హయాంలోనే మోసానికి శ్రీకారం చుట్టారని ఆరోపించారు. దళితుల ఓట్ల కోసం మాత్రమే ఆకార్యక్రమాన్ని వినియోగించు కున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను దళితులను బిఆర్ఎస్ పార్టీలో చేర్చుకునేందుకే దళిత బంధు ఆశ చూపారని వారు వాపోయారు.తమ నాయకుడు,మంథని ఎమ్మెల్యే ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంబేద్కర్ పథకం కింద దళితులకు రూ. 12లక్షలు అందజేస్తామని తెలిపారు.బీఆర్ఎస్ పాలనలో ఉన్నట్లు గా పార్టీ కార్యకర్తలకే పథకాలు పరిమితం చేసే సంస్కృతి కాంగ్రెస్ ప్రభుత్వంలో లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేస్తున్నామని, ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహాలు, ఉచిత విద్యుత్ సబ్సిడీ గ్యాస్, రైతులకు బోనస్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు.మంథని అభివృద్ధికి కృషి చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఐటీ మంత్రిగా అహర్నిశలు శ్రమిస్తున్న శ్రీధర్ బాబుపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించ బోమని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, మంథని డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సత్యం, మండల అధ్యక్షుడు మంథని రాకేష్, వెంకటాపూర్ సర్పంచ్ తోట పోచం, ఎరుకల రమేష్, ఎరుకల మధు, అక్కపాక సంపత్, తోకల మల్లన్న, పొన్నగంటి రమేష్, ఎరుకల సురేష్, గోమాస సమ్మయ్య, శేఖర్, కొండ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్పల్లిలో కాంగ్రెస్ పార్టీ కో-ఆప్షన్ సభ్యుడిగా

# అబ్దుల్ జాకీర్ పాషా నామినేషన్ దాఖలు



**చురకలు ప్రతినిధి కోరుట్ల, ఏప్రిల్,09 :** తెలంగాణ రాష్ట్రంలో మెట్ పల్లి మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని సాధించిన నేపథ్యంలో మెట్ పల్లి మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుల నోటిఫికేషన్ విడుదలైంది. ఈ సందర్భంగా గురువారం మెట్ పల్లి పట్టణ మున్సిపల్ కార్యాలయంలో 7వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అబ్దుల్ జాకీర్ పాషా, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నరసింగారావు నాయకత్వంలో వారి ఆదేశాల మేరకు మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడిగా తన నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా అబ్దుల్ జాకీర్ పాషా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని తెలిపారు. గత రెండు సంవత్సరాల పరిపాలనలో తమ 7వ వార్డులో జువ్వాడి నరసింగారావు ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లు, సీఎం రిలీఫ్ ఫండ్ సహాయం, మైనారిటీలకు కుట్టు మిషన్ల పంపిణీ, రోడ్డు నిర్మాణాలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని పేర్కొన్నారు.కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం జువ్వాడి నరసింగారావు అహర్నిశలు కష్టపడి ప్రజలకు సేవ చేస్తున్నారని, అలాగే పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తించి తనకు కో-ఆప్షన్ సభ్యుడిగా అవకాశం కల్పించినందుకు వారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.ఈ నామినేషన్ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపేట మండల రైతు సోదరులకు పోలీసు వారి విజ్ఞప్తి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఏప్రిల్ 09 :** రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టుకోవడం వలన రాత్రి సమయాల్లో వాటిని గ్రహించలేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తు న్నాయి కావున రైతులెవరు రోడ్డుపై వరి ధాన్యాన్ని ఆరబోసి ప్రమాదాల కారణం కావద్దని తెలిపినారు.ఎవరైనా రోడ్డుపై ధాన్యం ఆరబెట్టిన కారణంగా ప్రమాదాలు జరిగితే అట్టి యజమానిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డిపేట ఎస్సై కె.రాహుల్ రెడ్డి తెలిపినారు.


## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ లేటర్ల పంపిణీ





**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 09 :** ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్ పూర్ గ్రామంలో నూతనంగా ముగ్గురికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని వారికి ప్రొసీడింగ్ లేటర్లు గురువారం .గ్రామ సర్పంచ్ నాగేళ్ళ వెంకటరెడ్డి 1. చల్ల శంకర్ రెడ్డి,2. కొంపల్లి సరిత,3. నేరెళ్ల వజ్రవ్వ లకు అందజేశారు.ఇట్టి కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సోనవేని రాజయ్య,వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ చెట్టిపల్లి బాలయ్య,యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వుచ్చిడి పవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరిసిల్ల సురేష్,వంగళ మల్లారెడ్డి గ్రామ ఉపసర్పంచ్ కోర్రి అనిల్ కుమార్, వార్డ్ సభ్యులు మరోజు దేవేంద్ర,గట్ల మహిపాల్, పసులా పావని, భద్దుల శ్రావణి,నెరెళ్ల లత కార్యదర్శి భూక్యా సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు చేసిన పలువురిపై కేసు నమోదు



**చురకలు ప్రతినిధి,కరీంనగర్, ఏప్రిల్ 09 :** ఎంఐఎం పార్టీ జాతీయ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పై, ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర, జిల్లా ప్రజా ప్రతినిధులను, నాయకులను ఉద్దేశించి, దురుద్దేశ పూర్వకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అసభ్యకరమైన వీడియోలను తయారుచేసి సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ, షేర్, లైక్ చేస్తున్న పలువురిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ, మాజీ కార్పొరేటర్, ఎంఐఎం నాయకురాలు రాఫియ సుల్తానా, కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలంకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయగా..సీపీ ఆదేశాల మేరకు, కరీంనగర్ ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది.37వ డివిజన్ మాజీ కార్పొరేటర్ షర్ఫుద్దీన్ మహమ్మద్ పై, అతడి సోదరుడు ఖుర్షీద్ అలియాస్ బాజ్, షాసాహబ్ మొహల్లకు చెందిన అక్రమ్ అలియాస్ అబ్బు, ముకరం పుర మాజీ కార్పొరేటర్ సోదరుడు అమాన్ అబ్బాస్, సోదరుడి కుమారుడు బిలాల్ అలియాస్ సుల్తాన్ లతో పాటు మరికొందరిపై పోలీసులు, కేసు నమోదు చేశారు.

# డంపింగ్ యార్డ్ రద్దు చేయాలని కలెక్టర్‌కి వినతి

**-హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**



**చురకలు విలేఖరి కరీంనగర్ ఏప్రిల్ 09 :** హుజురాబాద్‌లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ని కలిసి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డివినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ..హుజురాబాద్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల కేవలం హుజురాబాద్ మండలం,పట్టణ ప్రజలకే కాకుండా చుట్టుపక్కల ఉన్న సైదాపూర్, కేశాపట్నం, మానకొండూర్ భీమదేవరపల్లి మండలాల ప్రజలు రైతులకు తీవ్రమైన ఇబ్బందులు ఎదు రయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. డంపింగ్ యార్డ్ కారణంగా గాలి, నీరు,భూమి కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావంపడే అవ కాశం ఉందని,ముఖ్యంగా రైతుల వ్యవసాయ భూములు,పంటలు నష్ట పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందో ళన వ్యక్తం చేశారు.ప్రజల ఆరోగ్యం, రైతుల భవిష్యత్తు మరియు పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా హుజురాబాద్‌లో ఏర్పాటు చేయాలనుకుంటున్న డంపింగ్ యార్డ్‌ను వెంటనే రద్దు చేయాలని కలెక్టర్ గారిని కోరారు. ఎమ్మెల్యే తో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చెర్మన్ బండ శ్రీనివాస్, జమ్మికుంట మున్సిపల్ చెర్మన్ ప్రశాంత్ కుమార్, కౌన్సిలర్ రవీందర్ రావు, రాజపల్లి సర్పంచ్ మల్లరెడ్డి,మాజీ ఎంపీపీ సురేందర్ రెడ్డి మాజీ పి ఏ సి ఎస్ చెర్మన్ కొండల్ రెడ్డి మాజీ కౌన్సిలర్ రమేష్ ఉప సర్పంచ్ సతీష్,శ్రీనివాస్ ఉన్నారు.

# డిపో మేనేజర్ అండదండలతో వేధింపులు

**-న్యాయం చేయాలని ఏడీసీ నారాయణ**




**చురకలు విలేఖరి,మంథని, ఏప్రిల్ 9 :** మంథని డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్ అండదండలతో బ్యాకప్ ఉద్యోగి సదానందం ఆర్థికంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని మంథని డిపో ఎడిసి ఈ విభాగ ఉద్యోగి కర్రే నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మంథని ప్రెస్ క్లబ్ లో ఆయన పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ సదానందం అనే వ్యక్తి వృత్తిరీత్యా ఆర్టీసీ కండక్టర్ అని, ఆయన గోదావరిఖని డిపోకు చెందిన ఉద్యోగి అయినప్పటికీ డిప్యూటేషన్ పై మంథని డిపోకు బ్యాకప్ పేరుతో ఉద్యోగం చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఎర్నింగ్ సెక్షన్ లో మంథని డిపో లో అడుగుపెట్టినప్పటి నుండి సిస్టం సంబంధించి ప్రింటర్ డ్యామేజ్, క్యాష్ కౌంటింగ్ మిషన్ డ్యామేజ్, ఇతరాత్ర సామగ్రి డ్యామేజ్ చేసిన విషయంలో అతనిపైన మంథని డిఎంకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం శూన్యమని అసహనం వ్యక్తం చేశారు. సదానందం అక్రమ పనులకు ఎవరైనా ఆర్టీసీ కార్మికులు ఎదురు తిరిగి మాట్లాడితే వారిపైన పనిష్మెంట్లు ఇప్పిస్తూ, పనిష్మెంట్లు క్లియరెన్స్ కొరకు డిఎం పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. డిప్యూటేషన్ పై ఆయన మంథని కి వచ్చి గోదావరిఖని డిపోకు సంబంధించిన వేతనం తీసుకోవడం వల్ల ఆర్టీసీ సంస్థకు లాభమా నష్టమా అధికారులు ఆలోచించాలని, సదానందం అక్రమాల పైన ఉన్నతాధికారులు విచారణ జరిపి సంస్థ పరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని నారాయణ కోరారు.

# కొత్తగట్టు మొలంగూర్ మధ్య రోడ్డు ప్రమాదం

**-కొత్తగట్టు దేవాలయ డైరెక్టర్ మృతి**
**-చైర్మన్‌కు గాయాలు**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 9 :** శంకరపట్నం మండలం కొత్తగట్టు మొలంగూర్ గ్రామాల మధ్య గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు గాయపడ్డారు గాయపడ్డారు. కొత్తగట్టు గ్రామానికి చెందిన శ్రీ మత్స్య గిరింద్ర స్వామి దేవాలయ చైర్మన్ కోరం రాజి రెడ్డి, డైరెక్టర్, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి



మీస రవీందర్ మొలంగూరు నుండి కొత్తగట్టుకు వస్తుండగా టిప్పర్ ఢీకొంది. దీంతో మీస రవిందర్ అక్కడికక్కడే మృతిచెందగా.. చైర్మన్ రాజిరెడ్డికి గాయాలయ్యాయి. ఆయనను కరీంనగర్లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. దేవాలయ డైరెక్టర్ మీస రవీందర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కొత్తగట్టులో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రవీందర్ మృతికి పలువురు సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## వెంకటాపూర్ గ్రామ శివారులో

# ఘోర రోడ్డు ప్రమాదం

**-ట్రాక్టర్ యజమాని దుర్మరణం**
**-డ్రైవర్‌కు గాయాలు**



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 09 :** ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం లో ట్రాక్టర్ యజమాని మనోజ్ దుర్మరణం చెందగా డ్రైవర్ నితిన్ తీవ్రంగా గాయపడ్డాడు.గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన ఆవునూరు ఎల్లారెడ్డి కుమారుడు మనోజ్ వారి ట్రాక్టర్ ను సిరిసిల్లలో



సర్వీసింగ్ ,ఆయిల్ చేంజ్ చేయించుకొని నాగంపేట కు వెళు తుండగా సిరిసిల్ల కామారెడ్డి ప్రధాన రాజదారిలోని వెంకటాపూర్ గ్రామ శివారులో ట్రాక్టర్ అదుపుతప్పి వ్యవసాయ పొలాలలోకి దూసుకు వెళ్ళింది.ఈ ప్రమాదంలో ట్రాక్టర్ పైనుండి కిందపడిన మనోజ్ అక్కడి కక్కడే దుర్మరణం చెందగా డ్రైవర్ నితిన్ తీవ్రగాయాలతో బ్రతికి బయట పడ్డాడు.ప్రమాదం పై ఎల్లారెడ్డిపేట పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

# వాహనాలకు త్వరగా మరమ్మత్తులు చేయించాలి

**-జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్**



**చురకలు విలేకరి,జగిత్యాల,ఏప్రిల్ 9 :** మున్సిపల్‌కు సంబంధించిన వాహనాలకు త్వరగా మరమ్మత్తులు చేయించాలని జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణిశ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.గురువారం విద్యానగర్ లోని వాటర్ ట్యాంక్ వద్ద జెసిబి యంత్రానికి మరమ్మత్తులు పూర్తి కాగా చైర్పర్సన్ వాణి ప్రత్యక్షంగా పరిశీలించి,పూర్తిస్థాయిలో వినియోగించి సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు.మిగితా వాహనాలకు సైతం త్వరగా మరమ్మత్తులు చేయించాలని,నిర్వహణ లోపం వల్ల ఎట్టి పరిస్థితుల్లో రిపేర్ కావద్దని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దుమాల రాజ్ కుమార్, కూతురు రాజేష్, కూతురు శేఖర్, ఖాజా కమలుద్దిన్, పిట్ట ధర్మరాజు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేంపేటలో ఉచిత వైద్య శిబిరం



**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 9 :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం వేంపేట్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులకు సుమారు 75మందికి పైగా వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ అల్లూరి సురేందర్ రెడ్డి,వార్డు సభ్యులు చంద్రచారి, దశకంఠ రాజు, నల్ల రాజశేఖర్ రెడ్డి, గోరుమంతుల రఘు పాల్గొన్నారు. వైద్య సేవలందించిన వారిలో పంచాయతీ కార్యదర్శి పాకాల రాజు, హెల్త్ సూపర్ వైజర్ అచ్యుత్, పల్లె దవాఖాన డాక్టర్ నాగార్జున, ఏఎన్ఎంలు సువర్ణ, రాజేశ్వరి, ఆశా వర్కర్లు పద్మ, దీప, లక్ష్మి, సంజీవలు పాల్గొన్నారు.

# అక్రమ లేఔట్ పై ఆర్డీఓకు ఫిర్యాదు



**చురకలు విలేకరి,మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 9 :** మెట్‌పల్లి మండలం మేడిపల్లి గ్రామంలో ఇబ్రహీంపట్నం క్రాస్ రోడ్డు వద్ద గల సర్వే నెంబర్ 702,703,704,705 లో గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయాలు జరుపుతున్నారని దానిపై తగిన చర్యలు తీసుకువాలని గురువారం సర్పంచ్ కడారీ రాజేష్ ఆర్డిఓ నర్సింహా రావు కు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు వారు మాట్లాడుతూ మిట్టపల్లి రాజారెడ్డి అనే వ్యక్తి పంచాయతీ నుంచి గాని డిటిసిపిఓ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రుల్స్ పాటించకుండా అక్రమ లేఔట్ ఏర్పాటు చేసి ప్రజలకు విక్రయిస్తున్నారని దీనిపై అతనికి నోటీసులు జారీ చేసిన ఎలాంటి స్పందన లేనందున్న అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.నాలా పరిమిషన్ లే ఔట్ విషయంలో వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే ప్రజలు ఇలాంటి ప్లాట్లు కొనుగోలు చేయవద్దని సర్పంచ్ కడారీ రాజేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గణేష్,పంచాయతీ కార్యదర్శి ముత్యాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ రద్దు కోసం బీఎస్పీ దీక్షలు

## -జేఏసీ దీక్షలకు న్యాయవాదుల మద్దతు



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఏప్రిల్ 9 :** హుజరాబాద్ మండలం సిర్సపల్లి గ్రామ శివారులో ప్రభుత్వం నెలకొల్పుతున్న వేస్ట్ టు ఎనర్జీ పవర్ (డంపింగ్ యార్డ్ ) ప్రాజెక్టును రద్దు చేయాలని అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా 18 వ రోజు బహుజన సమాజ్ పార్టీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎస్పీ జోన్ ఇంచార్జ్ పల్లె ప్రశాంత్ మాట్లాడుతూ ... ప్రజలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్యాన్ని కానుకగా ఇచ్చి ప్రజా జీవితాన్ని, పాడి పంటలను, ప్రకృతి సమతుల్యతను నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఈ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ను రద్దు చేయని పక్షంలో జరిగే తీవ్ర పరిణామాలకు, ప్రజా ఆందోళనలకు బాధ్యత వహించాలని హెచ్చరించారు. మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఈ పోరాటానికి నాయకత్వం వహిస్తామని తెలపడం, ప్రస్తుత ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఈ ప్లాంట్ రద్దు చేసే వారికి పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తానని ముందుకు రావడం, కాంగ్రెస్ హుజురాబాద్ అసెంబ్లీ ఇన్చార్జ్ ఒడితల ప్రణవ్ బాబు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్లాంట్ రద్దు చేస్తా అని పేర్కొనడం, కొత్తగా ఎన్నికైన మున్సిపాలిటీ చైర్మన్, సభ్యులు అందరూ ప్లాంట్ రద్దుకై తీర్మానం చేయడాన్ని ఆహ్వానిస్తూనే, ఏప్రిల్ 14 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గనుక ప్లాంటు రద్దు చేయని పక్షంలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజాపోరాటాలకి కార్యక్రమ ఎజెండా రూపొందిస్తామని తెలిపారు. బీఎస్పీ పార్టీ ఎజెండా ప్రజా ఎజెండా అని, ప్రజల జీవితాలని నాశనం చేసే కాలుష్య భూతాన్ని తరిమికొట్టే వరకు జేఏసీ కమిటీ ఇచ్చే ఏ కార్యక్రమానికైనా బీఎస్పి సంపూర్ణ మద్దతు తెలుపుతుందని అన్నారు. ఈ దీక్షకు స్థానిక న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కేసరి శేషయ్య నాయకత్వంలో దీక్ష శిబిరం వద్దకు తరలివచ్చి సంఘీభావం తెలిపారు. న్యాయవాదులు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయని పక్షంలో చట్టవరంగా కోర్టులో న్యాయపోరంటం చేస్తామని న్యాయవాదులు తెలిపారు. బీసీ ఉద్యమకారులు చందుపట్ల జనార్ధన్, సందెల వెంకన్న ఈ దీక్షకు మద్దతు తెలిపారు. రిలే నిరాహార దీక్ష అనంతరం అఖిల పక్ష నాయకులతో కలిసి ర్యాలీగా వెళ్లి స్థానిక తహసీల్దార్ కి విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పి పార్లమెంట్ ఇంచార్జ్ దొడ్డె సమ్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గిన్నారపు మహేందర్, అంబాల ప్రభు, వేల్పుల మల్లేశం, మారెపల్లి మొగిలయ్య, గరిగే చంద్రయ్య, కండె తిరుపతి, రామ్ శ్రీనివాస్, అచ్యుత్, మల్లయ్య యాదవ్, మంద జగన్, అఖిల పక్ష జేఏసీ కమిటీ సభ్యులు పల్కల ఈశ్వర్ రెడ్డి, వేల్పుల రత్నం,వేల్పుల ప్రభాకర్, హన్మంతరావు, తునికి రవి, తునికి సమ్మయ్య, జయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫలితాల్లో మోడల్‌గా నిలవాలి

## -విద్యార్థులు మంచి ప్రతిభ చూపాలి
## -జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 9 :** చిగురుమామిడి జడ్పిహెచ్ ఎస్ స్కూల్,ముల్కనూరు మోడల్ స్కూల్ సందర్శన ముల్కనూర్ మోడల్ స్కూల్ ఫలితాల్లో సరికొత్త చరిత్ర సృష్టించాలనీ, ఇందుకు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరచాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు.గురువారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల ను కలెక్టర్ సందర్శించారు. పాఠశాల పరిసరాలను పర్యవేక్షించారు. పాఠశాల విస్తీర్ణం ఎంత.. విద్యార్థులు ఎంతమంది చదువుతున్నారు.. విద్యాభ్యాసం ఎలా ఉంది తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముల్కనూరు గ్రామంలోని మోడల్ స్కూల్ ను కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ఎలా చదువుతున్నారు.. వసతులు ఎలా ఉన్నాయి.. పరీక్షలు ఎలా రాస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. మోడల్ స్కూల్ పరిసరాలు,భవన సముదాయాన్ని పరిశీలించారు.ఏమైనా పెండింగ్ వర్క్స్ ఉంటే వెంటనే కంప్లీట్ చేయాలని ఆదేశించారు. విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓకే మహేశ్వర్,జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ తహసిల్దార్ ముద్దసాని రమేష్ ఎంపీడీవో విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దామోదర్ రెడ్డి కాంస్య విగ్రహావిష్కరణకు హాజరైన వొడితల ప్రణవ్

## - దామోదర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం




**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 9 :** రాజకీయాల్లో ప్రజల అవసరాల కోసం పనిచేసి కరీంనగర్ జిల్లా టైగర్ గా,నమ్మకానికి,విశ్వసనీయతకు మారు పేరు తెచ్చుకున్న మహా నాయకుడు ముద్దసాని దామోదర్ రెడ్డి అని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.గురువారం రోజున కరీంనగర్ పట్టణ శివారులోని సదాశివపల్లిలో పెద్దపల్లి ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ విజయ రమణారావు ఆధ్వర్యంలో ఆయన 14వ వర్ధంతి సందర్భంగా కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ముద్దసాని దామోదర్ రెడ్డి గురించి జిల్లాలో తెలియని వ్యక్తి లేడంటే అతిశయోక్తి కాదని,వ్యక్తిగతంగా మా కుటుంబానికి,మా తాత వొడితల రాజేశ్వర్ రావు కు చాలా దగ్గరి వ్యక్తి అని,వారి నుండి మాలాంటి యువతర నాయకులం నేర్చుకోవాల్సింది చాలా ఉందని,వారి ఆశయాలకు అణుగుణంగా ప్రజా జీవితంలో పనిచేస్తామని, హుజూరాబాద్ నియోజకవర్గంలో దామోదర్ రెడ్డి విగ్రహాన్నీ ఏర్పాటు చేస్తామని ప్రణవ్ తెలిపారు.విగ్రహ ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సభలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా లోనే కాదు రాష్ట్రస్థాయిలో దామోదర్ రెడ్డికి అభిమానులు ఉండే వారని,వారి తర్వాత ఆ ప్రాంతానికి నాయకత్వం వహించే నాయకుడిగా వచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ,కరీంనగర్ శాసన సభ్యులు గంగుల కమలాకర్, కరీంనగర్ మేయర్ శ్రీనివాస్,సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు మల్లేష్,దామోదర్ రెడ్డి అభిమానులు భారీగా పాల్గొన్నారు.




# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు బంగారు పతకాలు



**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 9 :** విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పట్ల అవగాహన ఉండాలని మరియు వాటిలోని విషయాల పట్ల పట్టు సాధించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో చెందినటువంటి విద్యార్థులకు అంతర్జాతీయ సోషల్ స్టడీస్ ఒలంపియాడ్లో బంగారు పతకాలు సాధించడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైనవారు మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి సోషల్ స్టడీస్ పట్ల అవగాహన ఉండాలని మరియు వాటిలోని విషయాలను విశ్లేషణాత్మకంగా తెలుసుకొని వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీ పరీక్షలకు హాజరై విజయాలను నమోదు చేయాలని వారు చెప్పారు. సాంఘిక శాస్త్రం ద్వారా పోటీ పరీక్షల లో సైతం విజయాలను చాలా సులభంగా సాధిస్తారని వారు అభిప్రాయపడ్డారు .సాంఘిక శాస్త్రంలోని విషయాలు కేవలం పోటీ పరీక్షలకే కాకుండా సామాజిక అవగాహన పెంపొందించుటకు చాలా ఉపకరిస్తాయని వారు చెప్పారు.ఈ నిర్వహణలో భాగంగా ఇటీవల కాలంలో ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ అయినా సిల్వర్ జోన్ ఫౌండేషన్ వారు నిర్వహించినటువంటి అంతర్జాతీయ సోషల్‌స్టడీస్ ఒలింపియాడ్‌లో పాఠశాలకు చెందినటువంటి పలువురు విద్యార్థులు బంగారు పతకాలతో పాటు రజత పతకాలను సాధించడం చాలా గొప్ప విషయం వారు చెప్పారు

**విజేతల వివరాలు...**

కోలా అతిథి కిషన్, వి.వేద విహార్ ,బి.కార్తికేయ గౌడ్,విగ్నేష్, హెచ్.శ్రీహాన్ ,చైతన్య తదితరులు బంగారు పతకాలతో పాటు సర్టిఫికెట్లను గెలుచుకున్నారని వారు హర్షం వ్యక్తం చేశారు విద్యార్థులందరికీ పుష్పగుచ్ఛాలను అందజేసి భవిష్యత్తులోను మరిన్ని విజయాలను నమోదు చేయాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో రూ. 1.40 కోట్ల జీతాల కుంభకోణం బట్టబయలు

## -ఒక పోలీసు ఉద్యోగిపై కేసు నమోదు




**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 9 :** పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మరణించిన సిబ్బంది పేర్లతో జీతాలు డ్రా చేస్తూ ప్రభుత్వ ధనాన్ని కాజేస్తున్న భారీ కుంభకోణాన్ని అధికారులు వెలికితీశారు. సుమారు రూ. 1,40,18,308/- మేర నిధుల దుర్వినియోగం జరిగినట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ విచారణలో తేలింది.

**ప్రధానాంశాలు:**

**మోసం జరిగిన తీరు:** గతంలో పే-సెక్షన్‌లో పనిచేసిన ఒక పోలీసు ఉద్యోగి మరణించిన ముగ్గురు కానిస్టేబుళ్ల ఎంప్లాయీ ఐడీలను ఉపయోగించి,IFMIS పోర్టల్‌లో ఇతరుల పేర్లను చేర్చారు. నిందితుడు ప్రైవేట్ బ్యాంకుల్లో నకిలీ ఖాతాలు తెరిచి, తన వ్యక్తిగత మొబైల్ నంబర్లను అనుసంధానించడం ద్వారా 2022 నుండి 2026 వరకు ప్రభుత్వ జీతాల సొమ్మును అక్రమంగా పొందారు.

**నిధుల మళ్లింపు:** అక్రమంగా వచ్చిన సొమ్ముతో పర్సనల్ లోన్లు పొందడమే కాకుండా, నగదును వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు గుర్తించారు.ఈ ఘటనపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు బాధ్యుడైన పోలీసుఉద్యోగిపై కరీంనగర్ 1-టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని కరీంనగర్ వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ రాంచందర్‌రావు తెలిపారు. ఇంకా ఎవరెవరికి ఈ ఘటనతో సంబంధాలు ఉన్నాయని అంతర్గత విచారణ జరుపుతున్నామని, పూర్తి విచారణ జరిపి బాధ్యులైన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు.